
వాకర్స్ పార్కులో ప్రతిపాదిత మట్టి వాకింగ్ ట్రాక్



ఫ్లోర్ నిర్మాణానికి తెచ్చిన పలకలు



దెబ్బతిన్న ప్రవేశ ద్వారం





పార్కులో పిల్లల ఆట స్థలం దుస్థితి

అంతా అస్తవ్యస్తం

- వాకర్స్ పార్కులో అడుగు పెట్టాలంటేనే భయం
- ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న పనులు
- ఎక్కడ చూసినా రాళ్ల కుప్పలు, మట్టి దిబ్బలు
- నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

మురళీనగర్: మురళీనగర్‌లోని ప్రసిద్ధి చెందిన వాకర్స్ పార్కు నిర్వహణ లోపంతో, అసంపూర్తి పనుల కారణంగా వెలవెలబోతోంది. జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనుల పేరిట పార్కు చెత్తమయంగా, సందర్శకులకు అడుగడుగునా అసౌకర్యంగా మారింది. వాకర్స్ విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ రూ. 19 లక్షలు మంజూరు చేసిన మట్టి వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించి ఏడు నెలలు దాటినా నేటికీ పూర్తి కాలేదు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం, పనుల ఆలస్యం కారణంగా ట్రాక్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. ప్రస్తుతం నాలుగు అడుగుల లోతులో మట్టి తీసి పైపొర మాత్రమే వేశారు. ఇసుక, రంపపు పొట్టు వంటి మెటీరియల్ నింపి పూర్తి చేయాల్సిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

రాళ్ల కుప్పలు, బురదతో ఇబ్బందులు

ప్రస్తుతం పార్కులో ఎక్కడ చూసినా మట్టి దిబ్బలు, రాళ్ల కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ప్రవేశ ద్వారం నుంచి గాంధీ విగ్రహం వరకు ఉన్న సిమెంటు రహదారిపై బురద చేరడంతో వాకర్స్ జారిపడి ప్రమాదాల పాలవుతున్నారు. బుద్ధుడి విగ్రహం చుట్టూ కూడా చెత్త పేరుకుపోతున్నా పట్టించుకునేవారు లేరు. పార్కు అస్తవ్యస్తంగా మారడంతో సందర్శకులు రావడం మానేశారు. కాంట్రాక్టరు సకాలంలో పనులు పూర్తి చేయకపోవడం, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని వాకర్స్ డిమాండ్ చేస్తున్నారు.



రాళ్ల కుప్పలు

క్లుప్తంగా

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్



సీతా శ్రీనివాస్ చెబుతున్న కథను ఆసక్తిగా వింటున్న పిల్లలు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పబ్లిక్ లైబ్రరీ, విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పిల్లలను ఉత్సాహపర్చింది. కథాకారిణి ఎం.సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో చమత్కారం, తెలివితో ప్రత్యేకత సాధించిన ఒక చిన్న ఉల్లాస భరితమైన 'టైలర్ బర్డ్' కథను ఎంతో ఆసక్తికరంగా వివరించారు. కథ వినడమే కాకుండా వర్క్‌షాప్‌లో పిల్లలు పాటలు పాడి, పక్షులు కట్టె వివిధ రకాల గూళ్లు పరిశీలించి కొత్త విషయాలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, పెద్ద సంఖ్యలో వివిధ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శ్రీహర్షిత

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఆదివారం జరిగిన కర్ణాటక గాత్ర కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. డాక్టర్ వి.గౌరీ రామమోహన్ శిష్యురాలు వడ్డాది శ్రీహర్షిత అద్భుత గానంతో అలరించింది. శరణు సిద్ధి వినాయక, జగజ్జననీ, కమలాంబ, నీలమేఘ శరీర, ఓం నమో, గరుడధ్వని కీర్తనలు ఆలపించారు. ఈమెకు ఎం.కల్యాణ్ శశాంక్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శ్రీహర్షితను, కళాకారులను సత్కరించారు.

డ్రెయిన్ కల్వర్టు శిథిలం



గొల్ల వీధిలో డ్రెయిన్ కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గొల్లవీధి నుంచి గురుద్వారా కూడలికి వెళ్లే మార్గంలో కుమార్ క్యాటరింగ్స్ వద్ద డ్రెయిన్ కల్వర్టు శిథిలమైంది. రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడటంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. రాత్రి సమయంలో గొయ్యి కనబడక వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులకు దరఖాస్తులు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా మూడు కోర్సులు ప్రారంభిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్(కెమికల్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామన్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన, 8వ తరగతి పాసైన వారి కోసం కార్పెంటర్, పెయింటర్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం కోశాధికారిగా రాజారావు



ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర శాఖ కోశాధికారిగా జిల్లాకు చెందిన పాలగుమ్మి రాజారావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం జిల్లాలోని పెదగంట్యాడ మండలం గంగవరం ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు రాజారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడిగా పదేళ్లుగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పదవి కోసం తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం పనిచేస్తుందన్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు సహకారం



మాట్లాడుతున్న వెంకటరాజు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ కె.వెంకటరాజు తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంగా పనిచేస్తూ నడక, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ మాట్లాడుతూ సభ్యుల ఆరోగ్యంతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెలలో పుట్టిన రోజు చేసుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. వెంకటరాజుతోపాటు వాకర్ పొందూరు సూర్యనారాయణను సత్కరించారు. పార్కు అభివృద్ధికి తన వంతుగా రూ.5 వేలు విరాళంగా ఇస్తున్నట్లు సూర్యనారాయణ ప్రకటించారు. పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులు క్లబ్‌కు విరాళాలు అందజేశారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎ.వీరబాబు, పి.గిరిధర్, జి.రామకృష్ణ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సెప్టిక్ ట్యాంక్‌తో ఇబ్బందులు



కస్తూరినగర్‌లో ఇళ్ల మధ్యలో మెట్లపై నిర్మించిన సెప్టిక్ ట్యాంక్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం దరి కస్తూరినగర్‌లో ఇళ్ల మధ్యలో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కొండవాలు ప్రాంతంలో నడిచే మెట్ల మార్గాన్ని ఆక్రమించి ఓ ఇంటి యజమాని సెప్టిక్ ట్యాంక్ నిర్మించాడు. దీంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇంతకుముందు ఈ ప్రాంతంలో పిచ్చి మొక్కలు ఉండటంతో అది కనిపించేది కాదు. ఇటీవల ఈ ప్రాంతాన్ని శుభ్రపరచడంతో సెప్టిక్ ట్యాంక్ బయటపడింది. దీనిని మెట్లపై నిర్మించడంతో ఈ విషయాన్ని స్థానిక సచివాలయంలో, జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు స్థానికులు తెలియజేశారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా.. ఎటువంటి స్పందన లేదని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కస్తూరినగర్ వాసులు కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: రౌడీ షీటర్లు నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ ఉమాకాంత్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా మంచిగా నడుచుకోవాలన్నారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు



51వ వార్డులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పైడి శ్రీను



25వ వార్డులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముర్వల పోలారావు, పార్టీ శ్రేణులు



53వ వార్డులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి



44వ వార్డులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బాణాల శ్రీనివాసరావు, తరుణ్‌కుమార్, శ్రేణులు



14వ వార్డులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ శ్రేణులు

సీతంపేట: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు మేరకు వార్డుల్లో ప్రజా ఉద్యమం ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలో మాజీ కార్పొరేటర్ ముర్వల పోలారావు, ముర్వల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ, వార్డు స్థాయి వరకు 45 రోజుల పాటు సంతకాలు సేకరిస్తామని తెలిపారు. వైఎస్ జగన్ కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుంటే, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ, లక్ష్యం నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తన పాటలతో ఉత్సాహపరిచారు. పార్టీ నాయకులు సానబోయిన సురేష్, భోగవిల్లి గోవింద్, నూకరాజు, మొందూరి అప్పలరాజు, పోతిబంతి హరికృష్ణ, ముద్దాడ అశోక్, కొమ్మునాగు, బొట్ట వాసు, సూరిబాబు, బోరపూడి శ్రీను, ఆవుపాటి రాము, రాజు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

44వ వార్డులో..

44వ వార్డు కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి బాణాల తరుణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో 17 కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు వైద్యం అందకుండా చేస్తోందని విమర్శించారు. ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని సంతకాలు సేకరించాలన్నారు. పార్టీ 44వ వార్డు అధ్యక్షుడు హబీబ్, బాణాల యువసేన సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

14వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డులో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు ఆవిష్కరిచారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోడూరు సత్యనారాయణ, వర్మ, మూర్తి, రాజం రాజు తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో...

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యపరచి కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, పొన్నాడ అప్పారావు, కొత్తపల్లి రాణి, పైడి రాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

53వ వార్డులో..

53వ వార్డు కార్యాలయంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను కార్పొరేటర్ బర్కత్ అలీ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా ఉద్యమం ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు రామారావు, నబీ, సత్య, సుజాత, భాను, జయ తదితరులు పాల్గొన్నారు.



ఐటీఐ జంక్షన్ వద్ద వైన్ షాపు మేడపై బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు



మధురానగర్ రోడ్డులోని స్కూల్‌ను ఆనుకొని నిర్వహిస్తున్న వైన్ షాప్



బొదరా రోడ్డు మనోరమ థియేటర్ ప్రాంతంలో బహిరంగంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న యువకులు

విచ్చలవిడిగా మద్యం వ్యాపారం

నగరంలో మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. బడి.. గుడి.. నడిరోడ్డు.. జనావాసాలు అనే తేడా లేకుండా.. నిబంధనలతో అసలు పనిలేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పగలు, రాత్రి.. వేళాపాళా లేకుండా మందుబాబులు మద్యం కొనుగోలు చేస్తూ.. బహిరంగంగా తాగి తూగుతూ నానా రభస చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి బానిసైన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'అంకెల మామయ్య'.. భలే శిక్షణ ఇచ్చాడు..



వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చంద్రయ్య

మద్దిలపాలెం: పిల్లలను మొబైల్ ఫోన్‌ల వ్యసనం నుంచి దూరం చేసి, వారిలో సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంచే లక్ష్యంతో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీపాలెంలో ఆదివారం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్ నిర్వహించారు. 'మొబైల్ డి-అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు' అనే ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, 'అంకెల మామయ్య' చంద్రయ్య శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా చంద్రయ్య సైన్స్ సూత్రాలను చిన్న చిన్న ప్రయోగాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యే విధంగా వివరించారు. హిప్నోటిక్ స్ట్రా, ఎగిరే స్ట్రా, తిరుగుతున్న స్ట్రా, మ్యాచ్ బాక్స్ రైలు, విధేయుడైన అగ్గిపెట్టె, సింపుల్ యానిమేషన్, పేపర్ విజిల్, అరచేతిలో మ్యాజిక్ వంటి ఆసక్తికరమైన అంశాలతో పిల్లలు ప్రయోగాలు చేసి నేర్చుకున్నారు. మరోవైపు గణితంలో సరదా అంశాలైన తప్పిపోయిన అంకె, పుట్టినరోజు తర్కం, వయస్సు రహస్యం, స్పెల్లింగ్ లాజిక్ వంటివాటిని చెప్పించారు. ఈ కార్యకలాపాల ద్వారా పిల్లలు కేవలం సమయాన్ని గడపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు సులువుగా తెలుసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లల్లో శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, విమర్శనాత్మక ఆలోచన పెరుగుతాయని చంద్రయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కాయిన్ మ్యాజిక్ కాజా కూడా పాల్గొనగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మేజిస్ట్రేట్ స్పెషల్ డ్రైవ్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే మేజిస్ట్రేట్ జి.కార్తీక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వెయ్యి కేసులు పరిష్కరించారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నమోదు చేసిన 1,400 కేసుల్లో ఈ వెయ్యి కేసులను పరిష్కరించి, రూ.3 లక్షల జరిమానా విధించారు. మహిళా, దివ్యాంగుల బోగీల్లో ప్రయాణించడం, అనవసరంగా అలారం లాగడం, స్టేషన్‌లో, బోగీల్లో ఆకతాయిగా వ్యవహరించడం, రైల్వే ఆవరణలో ఆక్రమణలు, నో-పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపడం వంటి వివిధ ఉల్లంఘనలకు పాల్పడిన ప్రయాణికులు, వ్యక్తులపై ఈ కేసులు నమోదు చేశారు. ప్రత్యేక క్యాంపు ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేయడమే లక్ష్యమని దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవుల మృతి



ఘటనా స్థలిలో మరణించిన ఆవులు

మల్కాపురం: సర్వీస్ రోడ్డులో తెగిపడ్డ విద్యుత్ వైర్ కారణంగా రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. వివరాలు.. 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కొన్ని రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో మారుతి సర్కిల్‌కు వచ్చే వాహనాలను దారి మళ్లించారు. దారి మళ్లించిన మార్గంలో నేలపై విద్యుత్ వైర్ పడి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు నేల నాని ఉంది. శనివారం అర్ధరాత్రి విద్యుత్ వైర్ పడి ఉన్న మార్గాన సంచరిస్తున్న ఆవులు, ఆ వైర్‌కు సమీపం నుంచి వెళ్తూ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఉదయం ఆ మార్గాన వచ్చే వాహనదారులు చచ్చి పడి ఉన్న ఆవులను చూసి, పరిశీలించగా, అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైర్‌ను గుర్తించారు. కరెంట్ షాక్‌తో ఆవులు మృతి చెందాయని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలో మనుషులు సంచరిస్తే వారి పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శనలో బాలికలు

దాబాగార్డెన్స్: జగన్నాథ కళా సంక్షేమ సేవా సమాజం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ప్రేమసమాజం ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ పోటీల్లో నగరం నుంచే కాక ఇతర జిల్లాల నుంచి డ్యాన్స్ అకాడమీలు పాల్గొన్నాయి. బ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైనర్స్, అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్, నృత్య భారతి, అభినయ ప్రియ, నవ చైతన్య, నాట్య దీపిక కూచిపూడి అకాడమీ, యారాడ జెడ్పీ హైస్కూల్, ఏయూ (వేద గాయత్రి), శివ క్లాసికల్, ముద్రా డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, శాంతినికేతన్ స్కూల్, నవ చైతన్య కళా నాట్య సంఘం, కిరణ్మయి నృత్యాలయ, శ్రీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, హరి హర నృత్యానికేతన్, లయన్స్ క్లబ్‌తోపాటు వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీల నుంచి పలువురు చిన్నారులు పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

మేహాద్రిలో ఈత ప్రమాదకరం



మేహాద్రి రిజర్వాయర్ వద్ద సందర్శకులను హెచ్చరిస్తున్న పోలీసులు

పెందుర్తి: నిండు కుండను తలపిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఈత ప్రమాదకమరని సీఐ కేవీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మేహాద్రికి సందర్శకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో సమాచారం అందుకున్న సీఐ సతీష్‌కుమార్ పోలీస్ సిబ్బందిని అక్కడకు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను సిబ్బంది సందర్శకులకు వివరించారు. ఇక్కడ ఈత చేయరాదని, వారాంతంలో ఇక్కడకు వచ్చే వారంతా మేహాద్రి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి తరించాలి తప్ప ఈతకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.